Digital, tmedia.net.in

టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...


సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం 20/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

కరువు, ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ

చైర్మన్‌గా భట్టి విక్రమార్క




టీ మీడియా, అక్టోబర్ 19, హైదరాబాద్ బ్యూరో తెలంగాణ రాష్ట్రంలో కరువు పరిస్థితు లు, ఎల్‌నినో ప్రభా వాన్ని సమీక్షించి, వాటిని అధిగమించేందుకు అవసర మైన చర్యలపై సిఫార్సులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం

➤ మిగతా 2వ పేజీలో..

హింసకు నా జీవితంలో చోటు లేదు

సీఎం చంద్రబాబు



టీ మీడియా , అక్టోబర్ 19, అమరావతి బ్యూరో : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అరాచకాలను సాగనివ్వబోమని టీడీపీ అధినేత, సీఎం చంద్ర బాబు స్పష్టం చేశారు. స్వచ్ఛ రాజకీయాలకు నాంది పలు కుతూ సేవా భావమే పునాదిగా అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రీతిలో సామాజిక న్యాయం అమలు చేశామని బీసీలను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలనే లక్ష్యంతో ఈసారి ఎక్కువ సీట్లు కేటాయించామని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను మళ్లించడంతో పాటు ఆర్థిక సంఘం నిధులు అందకుండా అడ్డుకుందని విమర్శిం చారు. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందారులం కాదని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు వైఎస్సా ర్సీపీ చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.గంజాయి బ్యాచ్ వర్సెస్ విద్యావంతులు, రౌడీ మూకలు వర్సెస్ యువత అన్నట్లుగా పట్టణ, స్థానిక ఎన్నికల్లో పోటీ నెలకొందని సీఎం చంద్రబాబు తెలిపారు. పార్టీకి సేవలందించిన వారితో పాటు ప్రజలు మెచ్చిన అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కలిపి 63.6 శాతం సీట్లు కేటాయించామని బీసీలకే 35 శాతానికి పైగా అవకాశాలు కల్పించామని వెల్లడించారు. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాల్లోనూ యువత, మహిళలు, విద్యావంతులకు ప్రాధాన్యమిచ్చామని వెల్లడించారు. సోషల్ రీ-ఇంజనీరింగ్‌కు పెద్దపీట వేస్తూ ఒక్కో మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని వివరించారు. కూటమి అభ్యర్థులను

➤ మిగతా 2వ పేజీలో..





ఆస్ట్రేలియా గడ్డపై వైభవంగా బతుకమ్మ సంబరాలు

మెల్‌బోర్న్‌లో 6 వేల మందితో వేడుకలు

టీ మీడియా, అక్టోబర్ 19, మెల్‌బోర్న్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు

➤ మిగతా 2వ పేజీలో..



తమిళనాడు బీజేపీ పగ్గాలు ఎవరికి.?

రేసులో శరత్‌కుమార్ పేరు

టీ మీడియా, అక్టోబర్ 19, చెన్నై: తమిళనాడు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తదుపరి రాష్ట్ర అధ్యక్షుడు ఎవరనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్థానంలో కొత్త నేతను నియమిస్తారనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ ఊహాగానాల మధ్య కేంద్ర మాజీ సహాయ మంత్రి ఎల్. మురుగన్, వానతీ శ్రీనివాసన్‌తో పాటు సినీ నటుడు శరత్‌కుమార్ పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే, కొత్త అధ్యక్షుడి నియామకంపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

మురుగన్ రాజీనామాతో పెరిగిన ఉత్కంఠ

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన ఎల్. మురుగన్ అక్టోబర్ 13న తన మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, 2029 లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేయడం కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. అక్టోబర్ 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన రాజీనామాను ఆమోదించారు.

ఈ పరిణామంతో మురుగన్‌కు రాష్ట్ర పార్టీ నాయకత్వం అప్పగిస్తారనే చర్చ మొదలైంది. అయితే, ఆయన రాజీనామా రాష్ట్ర అధ్యక్ష

➤ మిగతా 2వ పేజీలో..

తెలంగాణ రైతులకు శుభవార్త!



యాసంగి సీజన్‌లో రాయితీపై విత్తనాలు

టీ మీడియా, అక్టోబర్ 19, హైదరాబాద్ బ్యూరో :తెలంగాణ లోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శు భవార్త అందించేందుకు సిద్ధమవు తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, పంటల సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకా శం ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేం దుకు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నా య ప్రణాళికను రూపొందించింది. యాసంగి సీజన్‌లో రైతులకు రాయితీపై విత్తనాలు అందించడంతో పాటు, తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు వారిని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం అమలుకు సుమారు రూ.224 కోట్ల నిధులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్లు సమాచారం.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో మార్పులు చేసుకోవడం ద్వారా రైతులకు కలిగే నష్టాలను తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వరి సాగుకు అవసరమైన నీటి లభ్యత తగ్గిన సందర్భాల్లో కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రోత్సాహం

వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూమిలో తేమ శాతం తగ్గడం వంటి పరిస్థితులు పంటల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా నీటి లభ్యతపై ఆధారపడే పంటల్లో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచించనుంది.కూరగాయలు, పప్పుధా న్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. రాయితీపై విత్తనాలు అందించడం వల్ల సాగు ప్రారంభ దశలో రైతుల పెట్టుబడి భారం కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే, పంటల ఎంపికలో స్థానిక వాతావరణం, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. గ్రామసభలు, రైతు మేళాల ద్వారా నీటి పొదుపు, నేలలో తేమ సంరక్షణ, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పద్ధతులపై రైతులకు వివరించనున్నారు.ఈ కార్యక్రమాల్లో భూగర్భ జల శాఖ, పంచాయతీరాజ్,

➤ మిగతా 2వ పేజీలో..





అమెరికా భవిష్యత్తు అధ్యక్షుడు మాకు వ్యతిరేకం కావచ్చు: నెతన్యాహు

హైదరాబాద్, అక్టోబర్ 19 ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు షాకింగ్ కామెంట్లు చేశారు. అమెరికా భవిష్యత్తు అధ్యక్షు డు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకం కావచ్చని ఆయన పేర్కొన్నారు. అమెరికా కు భవిష్యత్తులో కాబోయే అధ్యక్షుడు తమపై మిలిటరీ ఆంక్షలు విధించవచ్చని, అంతేకాకుండా ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయంగా ఉన్న ఆంక్షలకు కూడా మద్దతు తెలపవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భారత్‌తో పాటు

➤ మిగతా 2వ పేజీలో..



తెలంగాణ రైతులకు శుభవార్త!

గ్రామీణాభివృద్ధి శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారం తీసుకునే అవకాశం ఉంది. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, వ్యవసాయ కుంటలను ఏర్పాటు చేసుకోవడం, మల్చింగ్ పద్ధతిని అనుసరించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి

పంటలకు అవసరమైన నీటిని సమర్థంగా వినియోగించుకోవడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించడం ఈ ప్రణాళికలో కీలక అంశాలుగా ఉండనున్నాయి. నేలలో తేమను ఎక్కువ కాలం నిల్వ ఉంచే పద్ధతులను అనుసరించడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.అదేవిధంగా, రైతులు తమ ప్రాంతానికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవడం, నీటి లభ్యతను బట్టి పంటలను ఎంచుకోవడం ద్వారా పెట్టుబడులపై వచ్చే ప్రమాదాలను తగ్గించవచ్చని భావిస్తున్నారు.

రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యం

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక నివేదికను రూపొందించి, ప్రత్యామ్నాయ పంటల సాగు, రాయితీ విత్తనాల పంపిణీ, నీటి సంరక్షణపై కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.అయితే, రూ.224 కోట్ల నిధుల కేటాయింపు, రాయితీ విత్తనాల పంపిణీ, అర్హులైన రైతుల వివరాలు, విత్తనాల రకాలు, పంపిణీ తేదీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. రైతులు అప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ, తమ ప్రాంతానికి అనుకూలమైన పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవడం మంచిది.

హింసకు నా జీవితంలో చోటు లేదు

గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు సీఎం పిలుపునిచ్చారు. జగన్ పద్ధతి మార్చుకోవాలి.

అధికారంలో ఉన్నప్పుడు దాడులు, అరాచకాలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షం చేసిన వైఎస్సార్సీపీ ఇప్పుడు పెడబొబ్బలు పెట్టడం విడ్డూరంగా ఉందని సీఎం చంద్రబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నికలు పారదర్శకంగా జరుగుతున్నాయన్న చంద్రబాబు కుప్పం, పిఠాపురంతోపాటు కొన్ని కీలకమైన ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసిన విషయం జగన్ తెలుసుకోవాలని అన్నారు. అదే వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడైనా టీడీపీ నేతలు నామినేషన్లు వేసే పరిస్థితిని కల్పించారా అని నిలదీశారు. అధికారం పోయినా అరాచకాన్నే నమ్ముకుని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో గెలవాలని జగన్ చూస్తున్నారన్న చంద్రబాబు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

కరువు, ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ

జీవో జారీ చేసింది.ఈ మంత్రివర్గ ఉపసంఘానికి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి ఈ సబ్‌కమిటీలో సభ్యులుగా ఉండన్నారు.ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ఈ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించారు. ఆయన సబ్‌కమిటీ సమన్వయ బాధ్యతలు నిర్వహించడంతోపాటు, కమిటీ తీసుకునే నిర్ణయాలు, సిఫార్సులపై ముఖ్యమంత్రికి ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

తమిళనాడు బీజేపీ పగ్గాలు ఎవరికి.?

పదవికి అవకాశాలను పెంచుతుందనే నిర్ణయానికి రావడం తొందరపాటేనని పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం నయినార్ నాగేంద్రన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

శరత్‌కుమార్‌కు అవకాశం ఉందా?

తమిళనాడులో సినీ ప్రముఖులకు ఉన్న ప్రజాదరణను రాజకీయంగా ఉపయోగించుకోవాలనే వ్యూహంలో భాగంగా శరత్‌కుమార్ పేరు వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విజయ్ వంటి సినీ నేపథ్యం ఉన్న నేతలు రాజకీయాల్లో చురుకుగా ఉన్న నేపథ్యంలో, ప్రజలకు సుపరిచితమైన వ్యక్తికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని కొందరు భావిస్తున్నట్లు సమాచారం. అయితే శరత్‌కుమార్ నియామకంపై అధికారిక ధ్రువీకరణ లేదు.

వానతీ శ్రీనివాసన్ పేరు కూడా!

మహిళా నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ పేరు కూడా రాష్ట్ర అధ్యక్ష పదవికి సంబంధించి చర్చల్లో వినిపిస్తోంది. పార్టీని విస్తరించడం, నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కేడర్‌ను బలోపేతం చేయడం వంటి అంశాలు కొత్త అధ్యక్షుడి ముందున్న ప్రధాన సవాళ్లుగా నిలవనున్నాయి. ప్రస్తుతానికి ఎల్. మురుగన్, శరత్‌కుమార్, వానతీ శ్రీనివాసన్ పేర్లు రాజకీయ చర్చల్లో ఉన్నప్పటికీ, తుది నిర్ణయం బీజేపీ అధిష్ఠానానిదే. తదుపరి అధ్యక్షుడి ఎంపికపై అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ పేర్లన్నింటినీ ఊహాగానాలుగానే చూడాలి.

ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్



టీ మీడియా , అక్టోబర్ 19, ఖమ్మం:ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

అమెరికా భవిష్యత్తు అధ్యక్షుడు మాకు వ్యతిరేకం కావచ్చు: నెతన్యాహు

ల్యాటిన్ అమెరికా దేశాలతో సంబంధాలు మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని నెతన్యాహు పేర్కొన్నట్లు 'ద జెరూసలెం పోస్ట్, 'వైనెట్ న్యూస్' తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం ముగిసే వరకూ ఇజ్రాయెల్‌ను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని నెతన్యాహు అన్నారు. అలాగే ఇండియాతో పాటు ల్యాటిన్ అమెరికా దేశాలతోనూ ఇజ్రాయెల్ సంబంధాలు మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

'ట్రంప్ పదవీకాలం ఇంకో రెండేళ్లు మాత్రమే ఉంది. తర్వాత అమెరికాకు కొత్త ప్రెసిడెంట్ వస్తారు. అది పురుషుడు లేదా మహిళ కావచ్చు. కొత్త ప్రెసిడెంట్ మాకు వ్యతిరేకంగా ఉండవచ్చు. అలాంటి పరిస్థితుల్లో అమెరికాతో ఇజ్రాయెల్ తన సంబంధాలను ఎలా కొనసాగిస్తుంది?' అని నెతన్యాహు ప్ర?్యాఖ్యానించారు. కాగా.. గాజాలో హమాస్‌తో పాటు లెబనాన్, ఇరాన్‌లో హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. మరోవైపు ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆస్ట్రేలియా గడ్డపై వైభవంగా బతుకమ్మ సంబరాలు

ఆస్ట్రేలియా గడ్డపై అంగరంగ వైభవంగా జరిగాయి. ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెల్‌బోర్న్ నగరంలో నిర్వహించిన ఈ వేడుకలకు 6 వేల మందికి పైగా తెలంగాణ ప్రజలు హాజరై సందడి చేశారు. గత 13 ఏళ్లుగా ఆస్ట్రేలియాలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రవాస భారతీయులకు పరిచయం చేస్తున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు, ఆడపడుచులు ఉత్సాహంగా ఆటపాటల్లో పాల్గొన్నారు. విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా వేడుకలు సాగాయి. వేలాది మంది తెలంగాణ బిడ్డలు ఒకచోట చేరడంతో మెల్‌బోర్న్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

తెలంగాణ సంప్రదాయాలను కొనసాగించడం గర్వకారణం: అనిల్ బైరెడ్డి

ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్నారై నాయకుడు అనిల్ బైరెడ్డి మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా గడ్డపై తెలంగాణ సంప్రదాయమైన బతుకమ్మ పండుగను గత 13 ఏళ్లుగా కొనసాగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సంఘాన్ని తొలుత స్థాపించిన వ్యక్తిగా తనకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రవాసంలో ఉన్నప్పటికీ మన సంస్కృతిని మరచిపోకుండా ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్న ప్రతి తెలంగాణ బిడ్డకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ వంటకాలతో ప్రత్యేక ఏర్పాట్లు: కిరణ్ పాల్వాయి

ఆస్ట్రేలియా బీఆర్ఎస్ ఎన్నారై నాయకురాలు కిరణ్ పాల్వాయి మాట్లాడుతూ.. బతుకమ్మ సంబరాలను ఇంత వైభవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు అనుకూలంగా ఉండేలా సంప్రదాయ పిండి వంటలు, తెలంగాణ ప్రత్యేక వంటకాలను ఏర్పాటు చేసి అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రీతి రెడ్డి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి హాజరయ్యారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నిర్వాహకుల కృషి అభినందనీయం

ఈ వేడుకలను విజయవంతం చేయడంలో ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులు రాజ్ పుల్వాల, పుల్లా రెడ్డి, వంశీ కొట్టాల, మహేష్ బద్దం, ప్రవీణ్ దేశం, అమర్ అత్తాపురం, కృష్ణ వాడియాల, రవి దామెర, దీపక్, రఘు కొట్లా, మధు పర్సా, మధు పైళ్ల, రమేష్ ముత్యాల, సత్య గుండ, శ్యామ్, కార్తీక్, శ్రీకాంత్ నంగునూరి, రాజేష్, ఫణి, సతీష్, పరి, కర్ర శ్రీనివాస్, కిషోర్ యన్నం తదితరులు కీలక పాత్ర పోషించారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ



టీ మీడియా , అక్టోబర్ 19, ఖమ్మం:ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.రఘునాథ పాలెం మండలం బూడిదెంపాడు గ్రామానికి చెందిన కే సంపత్ కుమార్, తన భార్య బానోతు సోనాలీ పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర గ్రామానికి పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తూ జూన్ 9 2025న రోడ్డు ప్రమాదంలో మరణించారని, ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెన్షన్, ఇన్సూరెన్స్ డబ్బులు ఇంకా అందలేదని, తమ చెల్లింపులకు సంబంధించిన ఫైలు ఎంపీడీవో కార్యాలయం నుంచి పంపలేదని తెలిసిందని, తమకు కారుణ్య నియామకం కూడా ఇంకా కాలేదని తమ పరిస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అదేవిధంగా కారుణ్య నియామకం అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన క్షత్రివాణి బాయి సర్వేనెంబర్ 4/అ/1/1/2 లో గల బోరుబావి మీటర్ తన తండ్రి పేరు మీద ఉందని ఆ భూమి తనకు రిజిస్ట్రేషన్ చేశారని తన తండ్రి మరణించారని, మీటర్ పేరు మార్చాలని అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదని, విద్యుత్ మీటర్ తన పేరుకు మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఎన్పీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారికి రాస్తూ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదుపు కలెక్టర్ ఆదేశించారు. రఘునాధపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య, తనకు గ్రామంలో 700 చదరపు గజముల స్థలం ఉందని, అందులో తన ఇద్దరు కుమారులు ఇండ్లు నిర్మించుకున్నారని, తన కుమారులు తనను చూడటం లేదని, తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మ్మెల్యే దంపతుల చండీ హోమం

కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం



టీ మీడియా,అక్టోబర్19,సింగరేణి(కారేపల్లి): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని ప్రసిద్ధ శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్,లలిత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పర్స పట్టాభి రామారావు,ఆలయ కార్యనిర్వహణాధికారి కె. వెంకటయ్య ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.ఆలయంలో వేదపండితులు యలమంచలి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ హోమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.రాష్ట్రంలో కరువు కాటకాలు లేకుండా,సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోట మైసమ్మ తల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు.చండీ హోమంలో ఎంపీడీవో బి.పద్మ,తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, సింగరేణి సీఐ 10 సాగర్ ,ఎస్ఐ బైరు గోపి,ఉసిరికాయలపల్లి సర్పంచ్ వరలక్ష్మి--రాజు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ పరిసరాల్లో చేపడుతున్న జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు,పారిశుధ్యం,రాకపోకలు,భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళల ఆత్మగౌరవాన్ని,ప్రకృతితో తెలంగాణ ప్రజలకు ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



టీ మీడియా అక్టోబర్ 19లిఖమ్మం:నీటిని పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలని, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాగార్జున సాగర్ జలాల ఆధారంగా, మంచుకొండ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేసి ఈర్లపూడి చెరువును నింపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప కాలంలో వర్షాలు పడే సూచనలు తక్కువగా ఉన్నందున నీటిని ఎంతో జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులోని నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ వాడుకోవాలని సూచించారు. రైతులు నీటి అవసరం చాలా తక్కువతో సాగయ్యే ఆరుతడి పంటలు సాగు చేయాలని, వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగుచేయవద్దని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, నీరు, కరంట్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి అన్నారు. ప్రజలకు, పశు పక్ష్యాదులకు త్రాగునీరు ఎంతో ముఖ్యమని, నీటిని, కరంట్ ను పొదుపుగా వాడుకోవాలని మంత్రి తెలిపారు.ఈ పర్యటనలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి



టీ మీడియా అక్టోబర్ 19, కూసుమంచి :రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నవరాత్రులలో అమ్మవారిని నిష్ఠతో పూజించి, మనసులోని కోరికలన్నీ విజయదసరి రోజున అమ్మవారు తీర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బొమ్మలు చూపించి, సినిమాటిక్ గా ప్రకటనలు చేసి మోసం చేసిన ప్రభుత్వాలలా కాకుండా, అర్హులైన పేదవాడెవరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనేదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో కూడా విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 30 వేల నుంచి 2 లక్షల 40 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇంకా ఎంత ఖర్చయినా మూడో, నాలుగో విడతల్లో ఇళ్లు కట్టిస్తామని, అర్హులందరికీ అందజేస్తామని మంత్రి అన్నారు.కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుందని మంత్రి అన్నారు. ప్రతిపక్ష శాసనసభ్యుల నియోజకవర్గాల్లో కూడా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 లు సన్నబియ్యానికి బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా అందిస్తున్నామని, మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 73 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, మరో 14,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో మరిన్ని ఇవ్వబోతున్నామని తెలిపారు.గత 33 నెలల్లోనే కేవలం మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. పేదవాడి కష్టం తెలిసిన మన ప్రభుత్వం, పేదవాడి ముఖంలో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహశీల్దార్ సైదులు, హౌజింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జై భవానీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



టీ మీడియా, అక్టోబర్ 19, ఖమ్మం రూరల్:ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలోని హనుమాన్ గుడి సెంటర్‌లో జై భవానీ యూత్ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులతో పాటు స్థానిక ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.యువత సేవా భావంతో ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు సేవా దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జై భవానీ యూత్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు వల్లపు జెజికుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పగిళ్ల మహేష్ (చంటి), గ్రామ వీఓ అధ్యక్షురాలు వెలుపుల లక్ష్మీ భవానీ, కోడె దుర్గా భవానీ, కోడె వీరబాబు, కమిటీ సభ్యులు, స్థానిక యువకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అందరి సహకారంతో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి



టీ మీడియా ,అక్టోబర్ 19, కూసుమంచి:ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లింగరం తండాకు చెందిన యువరైతు బానోతు అజయ్ (22) సోమవారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పంట పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన అజయ్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడటంతో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది.ఈ ఘటనతో లింగరం తండాలో విషాదం అలుముకుంది. చేతికొచ్చిన యువకుడు అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న కూసుమంచి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. యువరైతు అజయ్ మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీజే శబ్దాలతో మహిళ మృతి

టీ మీడియా ,అక్టోబర్ 19, పాలేరు:
సద్దుల బతుకమ్మ సంబరాల్లో విషాదం చోటుచేసుకుంది. డీజే శబ్దాల మధ్య బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలం చెరువు మాదారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. నేలకొండపల్లి మండలం అప్పల నరసింహపురం గ్రామానికి చెందిన ఎలగాల భారతి (50) సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తన పుట్టినిల్లు అయిన చెరువు మాదారం గ్రామానికి వచ్చింది. ఆదివారం గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొంది. ఈ క్రమంలో నాలుగు డీజే సౌండ్లతో పెద్దఎత్తున శబ్దాలు వినిపించాయని స్థానికులు చెబుతున్నారు.వేడుకల్లో పాల్గొన్న భారతి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను వెంటనే



నేలకొండపల్లి ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం.పండుగ వేళ జరిగిన ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆనందోత్సాహాలతో జరగాల్సిన బతుకమ్మ సంబరాల్లో విషాదం నెలకొనడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

డీజే శబ్దాలపై చర్చ..

ఈ ఘటనతో పండుగలు, ఉత్సవాల సమయంలో అధిక శబ్దంతో కూడిన డీజే వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. అయితే, మహిళ మృతికి డీజే శబ్దాలే ప్రత్యక్ష కారణమా అనే విషయం వైద్యపరమైన నిర్ధారణతోనే స్పష్టమవుతుంది. ఉత్సవాల సందర్భంగా శబ్ద తీవ్రతపై నియంత్రణ, ప్రజల ఆరోగ్య భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆర్థిక చేయూత



టీ మీడియా, అక్టోబర్ 19, పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ఒకటో వార్డు అంబేద్కర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త దేవరపల్లి పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మరణవార్తను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ద్వారా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయంపై ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో స్పందించి, మృతురాలి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. ఒకటో వార్డు యువ నాయకుడు గంధం ఉత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు గంధం రాజశేఖర్, కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంతం దయాకర్ రెడ్డి, జిల్లా మాజీ యువజన నాయకుడు గంధం రంజిత్, కిసాన్ సెల్ అధ్యక్షుడు జగదీష్ రెడ్డి, గంధం సునీల్, వార్డు ఇన్‌చార్జి కొట్టిది వినయ్, వార్డు అధ్యక్షుడు అడ్డాకుల రాజు, మొతె రాములు, దాసరి పెద్ద రాములు, సిద్ధి అశోక్, జానమ్మతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మహాకాళి అవతారంలో దర్శనమిచ్చిన వాసవీ మాత



టీ మీడియా, అక్టోబర్ 19, పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహాకాళి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహాకాళి రూపంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహాకాళి అవతారంలో వాసవీ మాత దర్శనమివ్వడంతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది.అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు

సాగునీరు లేక ఎండుతున్న వరి పంటలు

● స్పందించని అధికార యంత్రాంగం



టీ మీడియా, అక్టోబర్ 19, పెబ్బేరు:సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో 100 ఎకరాలకు పైగా సాగు చేసిన వరి పంటలకు సమయానికి నీరు అందకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు కళ్ల ముందే వాడిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి చెందిన రైతు గోవిందు నాయుడు తన ఐదు ఎకరాల భూమిలో వరి సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందకపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే విధంగా గ్రామంలోని పలువురు రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సమయానికి నీరు అందకపోతే పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించిన రైతులకు నీటి కొరత మరింత భారంగా మారింది. పంటలు చేతికి వస్తాయని ఆశించిన సమయంలో సాగునీరు అందకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

పెంచికలపాడు గ్రామంలో సాగునీటి సమస్యను ప్రభుత్వం, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తే మిగిలిన పంటలైనా చేతికి వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగునీటి సరఫరాపై తగిన చర్యలు తీసుకోవాలని పెంచికలపాడు రైతులు కోరుతున్నారు.

నా పిల్లలను మంచిగా చూసుకోండి

-తీవ్ర ఒత్తిడి.. సాగర్ కాలువలో గల్లంతు



టీ మీడియా, అక్టోబర్ 19, పెనుబల్లి: ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. తన పిల్లలను మంచిగా చూసుకోవాలంటూ లేఖ రాసిన ఆయన సాగర్ కాలువలో గల్లంతయ్యారు. సుమారు పది గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటన పెనుబల్లి మండలం కొత్త కారాయిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది.

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు

కొత్త కారాయిగూడెం గ్రామానికి చెందిన దొడ్డపునేని వెంకటేశ్వరరావు (50) కోండ్రుపాడు గ్రామంలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు సమాచారం.ఈ క్రమంలో ఆయన రాసినట్లు చెబుతున్న లేఖలో తన పిల్లలను మంచిగా చూసుకోవాలని కుటుంబ సభ్యులను కోరినట్లు తెలిసింది.

పది గంటల పాటు గాలింపు

వెంకటేశ్వరరావు సాగర్ కాలువలో గల్లంతైన విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు పది గంటల పాటు శ్రమించిన అనంతరం ఘటనాస్థలానికి కిలోమీటరు దూరంలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు.వెంకటేశ్వరరావుకు భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు ఎదురైనప్పుడు తోడుగా నిలుద్దాం

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు బాధను ఒంటరిగా భరించకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడటం ముఖ్యం. కష్టకాలంలో బాధితులకు అండగా నిలిచి, అవసరమైన వైద్య, మానసిక సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

ఎంవీఎస్ఆర్ కాలేజీలో దాండియా ప్రమాదం..

- **యాజమాన్యంపై ఆదిభట్ల పోలీసుల కేసు**



టీ మీడియా , అక్టోబర్ 19, హైదరాబాద్: : నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ కళాశాలలో జరిగిన దండియా ఉత్సవాల సందర్భంగా లైటింగ్ ట్రస్ కూలిపోవడానికి ప్రధాన కారణం నిర్లక్ష్యమేనని తెలుస్తోంది. కళాశాల యాజమాన్యం, కార్యక్రమ నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా, నిర్మాణాల సామర్థ్యాన్ని అంచనా వేయకుండా తక్కువ సమయంలో తాత్కాలిక వేదిక, లైటింగ్ ట్రస్‌ను నిర్మించినట్లు అర్థమవుతోంది. ఫలితంగా బలమైన గాలుల కారణంగా అవి కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి మరణించగా, 21 మంది గాయపడ్డారు. గాయపడ్డ విద్యార్థిని ఫిర్యాదు ఆధారంగా కళాశాల యాజమాన్యం, కార్యక్రమ నిర్వాహకులపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం

'దసరా పండగ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు విద్యార్థులు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. 17వ తేదీ సాయంత్రం దాండియా వేడుకలు ఘనంగా మొదలైన కొద్దిసేపటికే, ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీయడంతో లైట్లు ఆగిపోయాయి. ఆ వెంటనే భారీ లైటింగ్ ట్రస్ అమాంతం విద్యార్థులపైకి కూలిపడింది. ఇంతమంది విద్యార్థులతో భారీ ఎత్తున ఈవెంట్ నిర్వహిస్తున్నప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినప్పటికీ, కళాశాల యాజమాన్యం, ఈవెంట్ ఆర్గనైజర్ ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' అని విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గాయపడిన వారికి చికిత్స కొనసాగుతోంది

ఈ ఘటనలో మొత్తం 22 మంది గాయపడినట్లు అధికారులు ధ్రువీకరించారు. మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా తలకు తీవ్ర గాయాలవడంతో మరణించగా, మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో స్పందన, అనన్య, అక్షర రెడ్డి, అనుజ్ఞ, శ్లోక, శ్రావ్య, సుష్మ, శ్రేష్ఠ, సానియా, హాసిని, మీనా, సింధు, దీక్షిత, కావ్య, తన్మయి, సత్విక, వైష్ణవి శర్మ, శైర, తరుణి, మైథిలి, సౌజన్య ఉన్నారు. వీరిలో 11 మందిని శనివారం అర్ధరాత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మిగిలిన వారిని మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్షర రెడ్డి, శ్రావ్య ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురిని ఆదివారం డిశ్చార్జ్ చేశారు.

నిరసనలతో దద్దరిల్లిన కళాశాల

ఎంవీఎస్ఆర్ కళాశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసనలు కొనసాగాయి. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ, సీపీఎం, ఎస్ఎస్యూఐ, జనసేన, ఓయూ విద్యార్థి విభాగం ప్రతినిధులు నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. సోనా తల్లిదండ్రులు అశోక్, నాగలక్ష్మి కూడా ధర్నాలో పాల్గొన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. సోనా కుటుంబానికి కళాశాల యాజమాన్యం సరైన న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థలు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలు పరిజాత డిమాండ్ చేశారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

- **ప్రజల భద్రతే లక్ష్యంగా ముదిగొండ పోలీసులు**
- **ముదిగొండ ఇన్‌స్పెక్టర్ ఓ. మురళి**

టీ మీడియా, అక్టోబర్ 19, ముదిగొండ: ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ముదిగొండ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఓ. మురళి అన్నారు. ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని ముదిగొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రజల సేవలో పోలీసులు

సమాజంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల ఆస్తులు, ప్రాణాల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తారని తెలిపారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లోనూ ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ విధులు నిర్వర్తిస్తారని చెప్పారు.దొంగతనాలు, సైబర్ నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల




పరిరక్షణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ప్రజలకు తక్షణ సేవలు అందించడం వంటి బాధ్యతలను పోలీసులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని వివరించారు. పోలీసు వ్యవస్థలో ప్రతి అధికారి, సిబ్బంది ప్రజల విశ్వాసాన్ని పొందేలా పనిచేయాలని సూచించారు.

21న పోలీసు అమరవీరుల సంస్మరణ

ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిని ఎదుర్కొంటూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది త్యాగానికి గుర్తుగా ఈ రోజును పాటిస్తున్నారు. అప్పటి నుంచి దేశ రక్షణతో పాటు అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకుంటారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు తమ వ్యక్తిగత జీవితాలను, కుటుంబ సమయాన్ని సైతం పక్కనపెట్టి విధులు నిర్వహిస్తున్నారని ఇన్‌స్పెక్టర్ ఓ. మురళి అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం పొందడం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని ఇన్‌స్పెక్టర్ ఓ. మురళి తెలిపారు. పోలీసుల సేవలను గౌరవిస్తూ, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

హనీట్రాప్‌తో పోలీసు అధికారినే బురిడీయత్నం

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువకుడు అరెస్ట్.**



టీ మీడియా , అక్టోబర్ 19, హైదరాబాద్:సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అందమైన యువతుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించడం.. యువకులతో పరిచయం పెంచుకోవడం.. వ్యక్తిగతంగా చాటింగ్ చేస్తూ నగ్న చిత్రాలు, వీడియోలు సేకరించడం.. ఆపై వాటిని బయటపెడతామంటూ బెదిరించి డబ్బులు వసూలు చేయడం.. ఇదే ఓ సైబర్ నేరగాడి మోసపూరిత వ్యూహం. ఈ విధంగా పలువురిని హనీట్రాప్‌లోకి దించి రూ.25.16 లక్షల మేర మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువకుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమ్మాయి పేరుతో పరిచయం..

పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన కొండభత్తుల పవన్‌కుమార్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బాలానగర్‌లోని సీఐటీడీలో డిప్లొమా చదువును మధ్యలోనే ఆపేసిన అతడు, తాను ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నట్లు తల్లిదండ్రులను నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో కొన్ని సంస్థల్లో స్వల్పకాలం ఉద్యోగాలు చేసిన అతడు, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సైబర్ నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

27 నకిలీ సోషల్ మీడియా ఖాతాలు

కోల్‌కతాకు చెందిన ఓ యువతి ఫొటోలను ఉపయోగించి 'చందన' పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. ఫేస్‌బుక్‌లో 14, ఇన్‌స్టాగ్రామ్‌లో 13 నకిలీ ఖాతాలతో పాటు రెండు వాట్సాప్ నంబర్లను ఉపయోగిస్తూ వెయ్యి మందికి పైగా యువకులతో పరిచయాలు పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.మొదట అమ్మాయిగా పరిచయం చేసుకుని ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపడం, చాటింగ్ ద్వారా నమ్మకం కలిగించడం, ఆపై అసభ్యకర సంభాషణలతో ఎదుటివారి నుంచి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించడం నిందితుడి ప్రధాన వ్యూహంగా పోలీసులు గుర్తించారు.

సోదరుడి అవతారంలో బ్లాక్‌మెయిలింగ్

తర్వాత నిందితుడు మరో ఎత్తుగడకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తానే ఆ యువతి సోదరుడినంటూ బాధితులకు ఫోన్ చేయడం, వాట్సాప్ ద్వారా సందేశాలు పంపడం చేసేవాడని పేర్కొన్నారు. తన సోదరితో అసభ్యంగా ప్రవర్తించారని, అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించారు.

రూ.25.16 లక్షల మేర నష్టం

నిందితుడు తనతో గతంలో డిప్లొమా చదివిన స్నేహితుడిని సైతం లక్ష్యంగా చేసుకుని రూ.4 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. పెట్టుబడులపై లాభాలు వస్తాయని నమ్మించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.7 లక్షలు తీసుకున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.ప్రాథమిక అంచనా ప్రకారం.. బెదిరింపుల ద్వారా రూ.18 లక్షలు, ఇతర మోసాల ద్వారా రూ.7.16 లక్షలు కలిపి మొత్తం రూ.25.16 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి మాయలో పడి 82 మంది తమ నగ్న ఫొటోలు, వీడియోలు పంపినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

దేశ, విదేశాలకు చెందిన బాధితులు

ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన 24 మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దుబాయ్, టర్కీ, పాకిస్థాన్, కెనడా దేశాలకు చెందిన మరో తొమ్మిది మంది కూడా బాధితుల నుంచి ఫొటోలు, వీడియోలు సేకరించిన ఈ మోసానికి గురైనట్లు తెలిపారు. బాధితుల్లో వైద్యులు, వ్యాపారులు, లెక్చరర్లు, ప్రైవేటు ఉద్యోగులు, డెలివరీ బాయ్స్, గిగ్ వర్కర్లు ఉన్నట్లు వెల్లడించారు.

ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం

నిందితుడి నుంచి మూడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఒక హెచ్‌పీ ల్యాప్‌టాప్, 16 జీబీ పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడికి సంబంధించిన మూడు బ్యాంకు ఖాతాలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. కోల్‌కతాకు చెందిన యువతి ఫొటోల వినియోగానికి సంబంధించి సంబంధిత సంస్థ, స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ

సైదాబాద్ పరిధిలో హనీట్రాప్ మోసాలకు పాల్పడుతున్న కొండభత్తుల పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే వెల్లడించారు. నకిలీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో పరిచయాలు పెంచుకుని బాధితులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఈ కేసులో బాధితులు మొత్తం రూ.25.16 లక్షల మేర నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు పేర్కొన్నారు.సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను తెలియని వ్యక్తులకు పంపవద్దని, ఎవరైనా వాటిని బయటపెడతామని బెదిరిస్తే భయపడి డబ్బులు చెల్లించకుండా పోలీసులను

మైదుకూరు పురపాలక ఎన్నిక వాయిదా

- **మళ్లీ నోటిఫికేషన్ : ఎస్ఈసీ**

టీ మీడియా , అక్టోబర్ 19, మైదుకూరు : వైఎస్?ఆర్? కడప జిల్లా మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నామినేషన్ పత్రాలను చించివేసినందున వాటి పరిశీలన కష్టమని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్కడి జిల్లా కలెక్టరు నుంచి వచ్చిన నివేదిక మేరకు మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేస్తున్నామని మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది త్వరలో తదుపరి నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు.నామినేషన్ల ఘట్టంలో ఉద్రిక్తతలు, అల్లర్లపై తమకు వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపించి వారి నుంచి వివరాలు అడుగుతున్నామని వచ్చిన నివేదికల మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎక్కడ ఎవరు అలసత్యం వహించినా తమకు క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలానే అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్‌లతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి తగిన ఆదేశాలు ఇస్తామని ఎస్ఈసీ తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు : నామినేషన్ల దాఖలు సందర్భంగా కొన్ని జిల్లాల్లో తలెత్తిన హింసాత్మక ఘటనలు పోలింగ్ రోజున పునరావృతం కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకునేలా ఎస్ఈసీ



అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం పకడ్బందీగా బందోబస్తు చేపట్టాలని సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ వెంకట్ రెడ్డి, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీ రాజకుమారితో నిర్వహించిన సమీక్షలో ఆదేశించారు.కొన్ని జిల్లాల్లో తలెత్తిన సమస్యల నేపథ్యంలో రాబోయే ఎన్నికల దశల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని సున్నిత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తును పునఃసమీక్షించి అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించకుండా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా జిల్లా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని సీఎస్ తెలియజేశారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, ఓటర్లు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్?ఈసీ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు సహకరించండి

• ఖర్గేకు రిజిజు లే



టీ మీడియా , అక్టోబర్ 19, ఢిల్లీ బ్యూరో : మహిళా రిజర్వేషన్ బిల్లుకు, డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రతిపాదనలకు సంబంధించి ప్రతిపక్షాలతో ఇప్పటికే చర్చలకు ప్రయత్నించామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ నేపథ్యంలో మరోసారి అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌పై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. కీలక చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించకుండా, నిర్మాణాత్మక సహకారం అందించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను కోరారు. డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో చర్చకు తీసుకురాకముందే ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే అక్టోబర్ 16న ప్రధాని నరేంద్ర మోదీకి నాలుగోసారి లేఖ రాశారు. దీనికి సమాధానంగా ఖర్గేకు సోమవారం రోజు రిజిజు లేఖ రాశారు.

ఖర్గే, రాహుల్‌తో చర్చలకు ప్రయత్నించాం

ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రయత్నించిందని రిజిజు తన లేఖలో స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చి 16, మార్చి 26, ఏప్రిల్ 12 తేదీల్లో ఖర్గేకు లేఖలు రాసి, బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఖర్గేతో వ్యక్తిగతంగా కూడా ఈ అంశంపై చర్చించినట్లు రిజిజు లేఖలో వివరించారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల సమయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ వ్యక్తిగతంగా తాను సమావేశమై బిల్లుకు సహకారం కోరినట్లు వెల్లడించారు. అయితే పలుమార్లు తాము విజ్ఞప్తి చేసినప్పటికీ చర్చల కోసం కాంగ్రెస్ తేదీలను ఖరారు చేయలేదని ఆయన ఆరోపించారు. దీంతో ప్రభుత్వం ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా సంప్రదింపులు జరిపిందని తెలిపారు.

సంప్రదింపులు జరిపిన పార్టీలివే

డీలిమిటేషన్ బిల్లుపై ఏకాభిప్రాయం కోసం సాధించేందుకు పలు పార్టీలతో ఇప్పటికే చర్చలు నిర్వహించినట్లు రిజిజు పేర్కొన్నారు. తాము చర్చలు జరిపిన వారిలో డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్సీపీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), శివసేన (ఎస్‌హెచ్‌ఎస్), ఎంఐఎం (ఏఐఎంఐఎం), బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రతినిధులు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రతిపక్ష పార్టీలతో చర్చలకు ప్రయత్నించినప్పటికీ, అఖిలపక్ష సమావేశం కోసం మళ్లీ కాంగ్రెస్ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 'ఇప్పటికే జరిగిన సంప్రదింపులను పరిగణనలోకి తీసుకోకుండా అదే డిమాండ్‌ను పునరావృతం చేయడం కంటే, ప్రతిపక్షాల నుంచి బిల్లుకు నిర్మాణాత్మక సహకారం అవసరం' అని రిజిజు తన లేఖలో పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలపై ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యాన్ని గౌరవిస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి ఉందని తెలిపారు.

పార్లమెంట్‌ను ప్రోరోగ్ చేయకపోవడంపై వివరణ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 13న నిరవధికంగా వాయిదా పడినా ఇప్పటివరకు సభను అధికారికంగా ప్రోరోగ్ (సెషన్ అధికారికంగా ముగించడం) చేయలేదని ఖర్గే లేఖలో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపైనా స్పందించిన రిజిజు– సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ఎంత వ్యవధిలో ప్రోరోగ్ చేయాలనే దానిపై రాజ్యాంగం నిర్దిష్ట గడువును విధించలేదని స్పష్టం చేశారు. గతంలోనూ పార్లమెంట్ సభలు ఎక్కువ కాలం ప్రోరోగ్ కాకుండా ఉన్న సందర్భాలు ఉన్నాయని వివరించారు.

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల సంగతేంటి

ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు ద్వారా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను 850 వరకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన అవసరం అని, దాని ద్వారానే లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయొచ్చని అధికార ఎన్డీఏ కూటమి వాదిస్తోంది. అందుకే మహిళా బిల్లు కోసం ముందుగా డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ రెండింటికీ లింక్ పెట్టింది. ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి వైఖరి మరోలా ఉంది. ప్రస్తుతం ఉన్న 543 మంది సభ్యుల లోక్‌సభలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదిత బిల్లుల ఆమోద ప్రక్రియలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీని కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విభేదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ప్రతిపక్షాలతో అర్థవంతమైన చర్చలకు సిద్ధంగా ఉందని రిజిజు తన లేఖలో పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో తీసుకురానున్న కీలక చట్టాలకు అడ్డంకులు సృష్టించకుండా కాంగ్రెస్ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసులో బిగ్ ట్విస్ట్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటనపై ఉత్కంఠ

టీ మీడియా, అక్టోబర్ 19, ముంబై: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కీలక ఆధారం లభించినట్లు సమాచారం. దుండగులు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న పల్సర్ మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిపిన అనుమానితుల ఫొటోలు కూడా వెలుగులోకి వచ్చాయి. మరోవైపు, ఈ దాడికి తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు ప్రకటించుకున్నారు.



రైల్వే స్టేషన్ సమీపంలో బైక్ వదిలేసి పరారీ

పోలీసుల దర్యాప్తు ప్రకారం, కాల్పుల అనంతరం నిందితులు విలే పార్లే రైల్వే స్టేషన్ సమీపంలో తమ మోటార్‌సైకిల్‌ను వదిలేసి, లోకల్ రైలులో పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న బైక్ సెకండ్‌హ్యాండ్ వాహనమై ఉండవచ్చని ప్రాథమిక సమాచారం. ఈ వాహనం యజమాని వివరాలు, దాని కొనుగోలు చరిత్ర, నిందితులతో ఉన్న సంబంధాలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ కేసును ఛేదించేందుకు ముంబై పోలీసులు 15 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. క్రైమ్ బ్రాంచ్ కూడా సమాంతరంగా దర్యాప్తు చేస్తోంది. సీసీటీవీ దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల ప్రయాణ మార్గాల ఆధారంగా ఆధారాలు సేకరిస్తున్నారు.

టైగర్ డ్రైవర్‌కు గాయాలు

2026 అక్టోబర్ 18, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ మ్యాచ్ నుంచి కారులో తిరిగి వస్తున్న సమయంలో టైగర్ ష్రాఫ్ వాహనంపై కాల్పులు జరిగినట్లు కథనాలు వెల్లడించాయి. ఆ సమయంలో ఆయన అభిమానులకు స్పందిస్తున్నట్లు సమాచారం. గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపి మోటార్‌సైకిల్‌పై పారిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో టైగర్ డ్రైవర్ ఫిర్దోస్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. టైగర్‌కు నేరుగా బుల్లెట్ తగలలేదని, పగిలిన గాజు ముక్క కారణంగా ఆయన కుడి చేతికి స్వల్ప గాయమైనట్లు కథనాలు పేర్కొన్నాయి. ఘటనకు సంబంధించి జుహు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాకీ ష్రాఫ్ స్పందన.. టైగర్ క్షేమం

ఈ ఘటనతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. టైగర్ ఆరోగ్యంపై ఆయన తండ్రి, సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ బృందం స్పందిస్తూ టైగర్ క్షేమంగానే ఉన్నట్లు ప్రకటించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా టైగర్‌ను పరామర్శించి, నిందితులను త్వరగా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటనపై ఉత్కంఠ

ఈ దాడికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిట్, హర్మన్ సింధు బాధ్యత వహించినట్లు ప్రచారం జరుగుతోంది. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు భావిస్తున్నారు. అయితే, ఈ ప్రకటన నిజమైనదా? కాల్పుల వెనుక అసలు కారణం ఏమిటి? టైగర్ ష్రాఫ్‌నే లక్ష్యంగా చేసుకున్నారా? అనే అంశాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.ప్రస్తుతం పోలీసులు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిల్, సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలు ఈ కేసులో కీలకంగా మారే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు దాడి వెనుక ఉన్న వ్యక్తులు, ఉద్దేశం గురించి తుది నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుంది.

రాచరిక వైభవానికి ప్రతీక

•బొబ్బిలి యుద్ధం నాటి ఆయుధాలకు పూజలు

టీ మీడియా, అక్టోబర్ 19, బొబ్బిలి : రాజాధిరాజా అంటూ సేవకులు రాజావారి కోటలో కవాతు చేశారు. కత్తులు, కటార్లు, డాళ్లు, బరిసెలు, తుపాకీలు చేతపట్టుకుని కదం తొక్కారు. అదే సమయంలో వజ్ర వైడూర్యాలు పొదిగిన తలపాగా, ఆభరణాలు, రత్నాలు పొదిగిన కత్తులతో, రాజరిక దుస్తులు ధరించి సంప్రదాయబద్ధంగా కోట లోపల నుండి బయటకు వచ్చారు బొబ్బిలి రాజవంశీయులు. అలా వచ్చిన రాజవంశీయులకు అక్కడున్న వారంతా ఘన స్వాగతం పలికారు.

ఆచార వ్యవహారాలు, మేళతాళాలతో రాజవంశీయులు హుందాగా ముందుకు నడుస్తుండగా.. సేవకులు వారిని దర్బార్ మహల్ కి తోడ్కొని వెళ్లారు. సింహాసనంపై దివంగత రంగారావు ఫోటో ఉంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నేటికీ రాచరికానికి నిలువుటద్దంలా ప్రతిబింభించే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంత ప్రజలు తరలివచ్చారు.విజయదశమి సందర్భంగా కోటలో జరిగే ఆయుధ పూజ అందరినీ ఆకట్టుకుటుంది. చారిత్మాత్మక బొబ్బిలి యుద్ధం 1757లో జరిగింది. యుద్ధం జరిగి వందల సంవత్సరాలు అయినా నాటి జ్ఞాపకాలు మాత్రం నేటికీ మిగిలే ఉన్నాయి. ఆ తరువాత రోజుల్లో బొబ్బిలి వారసులు తిరిగి తమ రాజ్యాన్ని పునర్ నిర్మించుకున్నారు. అప్పటి నుండి బొబ్బిలి వారసులు నాటి యుద్ధంలో వాడిన



ఆయుధాలను శౌర్య పరాక్రమాలకు చిహ్నంగా భద్రపరిచారు. వాటి కోసం దర్బార్ హల్ లో ఒక మ్యూజియంను ఏర్పాటు చేసి సందర్శకులకు అందుబాటులో ఉంచారు.అలా భద్రపరిచిన ఆయుధాలను ప్రతి ఏటా విజయదశమి సందర్భంగా బయటకు తీసి ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఆయుధ పూజను బొబ్బిలి రాజవంశీయుల వారసులైన మాజీమంత్రి రావు సుజయ కృష్ణ రంగారావు బహుదూర్, ఆయన సోదరుడు ఎమ్మెల్యే బేబి నాయనలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఈసారి ఆయుధపూజ కార్యక్రమాన్ని నిరాడంబరంగా జరుపుకున్నామన్నారు బొబ్బిలి రాజవంశీయులు, ఎమ్మెల్యే బేబీ నాయన. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ ఆయుధపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజులు, రాజ్యాలు కనుమరుగైనా.. నాటి సాంప్రదాయాలను బొబ్బిలి రాజవంశీయులు ఇప్పటికీ కొనసాగిస్తూ ఆచారాలను పాటిస్తున్నారు.

హైదరాబాద్‌లో మరో కొత్త కమిషనరేట్

•ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

టీ మీడియా , అక్టోబర్ 19, హైదరాబాద్:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. సోమవారం ఫ్యూచర్ సిటీలో కొత్తగా త్తగా నిర్మించిన పోలీస్ కమిషనరేట్‌ను అధికారికంగా ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ జూ తరుణ్ జోషిని కుర్చీలో కూర్చోబెట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.ఆ తర్వాత.. విద్యా, పట్టణ ప్రణాళికా రంగాలకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు సీఎం. అనంతరం ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రధానంగా.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించి.. నిర్మాణ పనులను ఆరా తీశారు. యూనివర్సిటీ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయి?.. మౌలిక వసతుల కల్పనపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?.. అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించబోయే గ్లోబల్



ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సన్నాహక ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆధునిక పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కొనే సాంకేతిక నిపుణులను, అర్బన్ ప్లానర్లను తీర్చిదిద్దడంలో ఈ క్యాంపస్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందనుంది. ఆయా కార్యక్రమాల తర్వాత.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ నెట్‌వర్క్ లాంటి మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడుల ఆకర్షణ, భూసేకరణ పురోగతిపై చర్చించారు.

ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బానోత్ కిషన్ నాయక్

టి మీడియా, అక్టోబర్ 19, ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ బానోత్ కిషన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆశీస్సులతో కిషన్ నాయక్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించాలని కోరారు. నూతన ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన బానోత్ కిషన్ నాయక్ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

